క్లుప్తంగా

కోర్టులో మాస్కుల పంపిణీ



మాస్కులు పంపిణీ చేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టుకు వచ్చిన కక్షిదారులకు శ్రీసత్యసాయి సేవా సమితి మిర్యాలగూడ కన్వీనర్ చిల్లంచర్ల ఆదినారాయణ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. శ్రీనివాస్‌రెడ్డి, మిర్యాలగూడ టూటౌన్ సీఐ నర్సింహారావు మాస్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం కోవిడ్ కేసులు పెరుగుతున్నందున ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు లింగంపల్లి శ్రీనివాస్, కొంక వెంకన్న, కుమార్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు ఖాజా హమీదుద్దీన్, శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు శ్రీనివాస్ గుప్తా, సాంబశివ తదితరులున్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శివరామకృష్ణ



శివరామకృష్ణను సన్మానిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన కర్నాటి శివరామకృష్ణను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలో శివరామకృష్ణను సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పాగుల సైదులుగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తన నియామకానికి సహకరించిన వారికి శివరామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు కోల వెంకన్న, శ్రీను, రాజు, వెంకన్న, వేణు, యాదగిరి, శ్రవణ్ తదితరులున్నారు.

డాహిల్ హైస్కూల్‌లో న్యూ ఇయర్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని రెడ్డికాలనీలో గల డాహిల్ హైస్కూల్‌లో శనివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు డ్యాన్సులు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సాయిశ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, మౌలాబీ, జులేఖ పాల్గొన్నారు.

రాయపూడి భవానీకి సిల్వర్ స్టార్ అవార్డు



సిల్వర్ స్టార్ అవార్డు అందుకుంటున్న రాయపూడి భవాని

మిర్యాలగూడ టౌన్: ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో శనివారం ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల కార్యక్రమంలో మిర్యాలగూడకు వాసవీ క్లబ్ రీజియన్-2 చైర్మన్ రాయపూడి భవాని సిల్వర్ స్టార్ అవార్డు అందుకున్నారు. వాసవి క్లబ్ ఇంటర్నేషల్ గవర్నర్ పాలకుర్తి గాయత్రి, జిల్లా గవర్నర్ వంగవీటి గురుమూర్తి చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. రాయపూడి భవానికి వాసవీ క్లబ్ రీజినల్ సెక్రటరీ తిరునగరు పద్మావతి, జోన్ చైర్మన్ భువనగిరి లావణ్య, ఆర్‌ఈసీ వీరవెల్లి పద్మావతి, వనతి క్లబ్ ప్రెసిడెంట్ అనిత, లక్ష్మి, పుష్పావతి, ఇందిర తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

రాహుల్ గాంధీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

మిర్యాలగూడ టౌన్: కేంద్రంలో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే దేశ వ్యాప్తంగా కుల గణన చేపడతామని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుల గణన నిర్వహిస్తే ఓబీసీలకు నిజమైన సామాజిక న్యాయం దక్కుతుందని అన్నారు. ఓబీసీలు అన్నిరంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కుల గణన గురించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

గ్యాస్ ఏజెన్సీ, ఆధార్ సెంటర్ల దందా

- గ్యాస్ పైప్ కొంటేనే కేవైసీ చేస్తామని గ్యాస్ ఏజెన్సీల కొర్రీలు
- ఆధార్‌లో మార్పులకూ అధికంగా వసూలు చేస్తున్న నిర్వాహకులు

మిర్యాలగూడ అర్బన్: సంక్షేమ పథకాలు (ఆరు గ్యారంటీలు) ఎప్పుడు అందుతాయో తెలియదు కాని వాటి కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు ఉత్సాహం కనబరుస్తున్నారు. ఈ అవకాశాన్ని క్యాష్ చేసుకునే పనిలో కొంతమంది గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో పాటు ఆధార్, జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో అర్హులందరూ ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఓ వైపు ప్రభుత్వం ఆధార్ కార్డు అప్‌డేట్ చేయాల్సిన అవసరం లేదని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం కొందరు ఆధార్ ఎక్కడ ఉంటే అక్కడే దరఖాస్తు చేసుకోవాలని చెబుతుండడంతో ఆధార్ కార్డులలో అడ్రస్, ఇతర తప్పులను సరిచేసుకునేందుకు ఆధార్ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు.

గ్యాస్ ఏజెన్సీల కొర్రీలు..

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామని చెబుతున్న రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం కోసం కేవైసీ చేయాలంటూ కొందరు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు కొత్త దందాకు తెరలేపారు. కేంద్రం ఉజ్వల పథకం కింద ఇచ్చే ఉచిత గ్యాస్ కనెక్షన్లకు మాత్రమే కేవైసీ తీసుకోవాల్సి ఉంది. ఈ కేవైసీ తీసుకోవాలంటే తమ వద్ద గ్యాస్ పైప్ కొనాలని కొన్ని ఏజెన్సీలు కొర్రీలు పెడుతున్నారు. చేసేదేమీ లేక వినియోగదారులు రూ.190 పెట్టి పైప్ కొని వేలిముద్ర వేస్తున్నారు. అదే విధంగా గ్యాస్ బుక్ ఎవరి పేరు మీద ఉందో ఆ వ్యక్తి చనిపోతే మృతుడి మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు లాయర్ నోటరీ ఉంటే ఎలాంటి రుసుము లేకుండానే గ్యాస్ బుక్‌పై పేరును మార్చాలి. కానీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం ఇందు కోసం రూ.1000 వసూలు చేస్తున్నారని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. వినియోగదారుడు గ్యాస్ బుకింగ్ చేసిన తర్వాత దానిని ఇంటికి చేరవేసే బాధ్యత ఆయా గ్యాస్ ఏజెన్సీలదే. కానీ గ్యాస్ డెలివరీ బాయ్‌లకు ఆ సొమ్మును ఇవ్వకపోవడంతో వారు నేరుగా వినియోగదారుల నుంచి రూ.60 వరకు వసూలు చేస్తున్నారు.



గ్యాస్ ఏజెన్సీ వద్ద కేవైసీ కోసం వచ్చిన వినియోగదారులు

ఆధార్, జిరాక్స్ సెంటర్ల నిర్వాహకుల అధిక వసూళ్లు..

కాగా సంక్షేమ పథకాలకు ఆధార్ కార్డు ప్రామాణికంగా క్షేత్రస్థాయి అధికారులు చెబుతుండటంతో ఆధార్‌లో తప్పులు సవరించుకోవడం, మార్పులు చేర్పులు వంటి వాటికి ఆధార్ సెంటర్ నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. కొందరు దళారులు సరైన పత్రాలు లేకున్నప్పటికీ ఆధార్ ఇప్పిస్తామంటూ రూ.3వేల నుంచి రూ.5వేలు వసూలు చేస్తున్నారు. జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు సైతం ఒక్కో జిరాక్స్‌కు డబుల్ వసూలు చేస్తున్నారు. కాగా మిర్యాలగూడలోని ఇండేన్ గ్యాస్ నిర్వాహకుడు గుంటూరు రామారావును వివరణ కోరగా.. గ్యాస్ పైప్ కావాలనుకునే వారికే ఇస్తున్నామని తెలిపారు. గ్యాస్ కంపెనీలు పైప్ కొనాలనే నిబంధన ఏమీ పెట్టలేదని.. తామే వినియోగదారులకు వారి సేఫ్టీ కోసం ఇస్తున్నామని చెప్పారు.

రూ.1000 తీసుకున్నారు



నా భర్త పది నెలల కింద మరణించాడు. ఆయన పేరుతో ఉన్న గ్యాస్ బుక్‌పై నా పేరు ఎక్కించాలని గ్యాస్ ఏజెన్సీ చుట్టూ ముడు రోజులు తిరిగా. చివరకు రూ.1000 ఇస్తే పేరు మారుస్తామని చెప్పడంతో చేసేది లేక రూ.1000 ఇచ్చి పేరు మార్పించాను.

– ఎస్. పుష్పమ్మ, వేములపల్లి

అవసరం లేకున్నా కొన్నాను



నాకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్ ఉంది. దాని కోసం వేలి ముద్ర వేయాలని చెప్పడంతో గ్యాస్ ఏజెన్సీకి వెళ్తే గ్యాస్‌పైప్ కొంటేనే వేలి ముద్ర వేసుకుంటామని చెప్పారు. రూ.190 ఇచ్చి పైప్ కొని వేలిముద్ర వేయించుకున్నాను. అవసరం లేకున్నా పైప్ కొనాల్సి వచ్చింది.

– దాసరాజు లక్ష్మమ్మ, వెంకటాద్రిపాలెం

లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయమూర్తి వేణు

మిర్యాలగూడ టౌన్: కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ చక్కటి వేదిక అని ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి జి. వేణు, సీనియర్ సివిల్ జడ్జి సుజయ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ. స్వర్ణలత, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి బీఎస్ఎస్ సుమబాల అన్నారు. శనివారం మిర్యాలగూడ కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షణికావేశంలో చేసిన తప్పులకు శిక్ష అనుభవిస్తున్న వారు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పులే అంతిమ తీర్పుగా ఉంటుందని, ఈ తీర్పుకు అప్పీల్ అనేది ఉండదన్నారు. కేసులను రాజీ చేసుకోవాలనే వారికి న్యాయ సేవా అధికార సంస్థ ముందుగా నోటీసులు జారీ చేస్తుందన్నారు. వాది, ప్రతివాదులు తమ గుర్తింపు పత్రాలతో రావాలని, వచ్చిన ఇరువర్గాలను పిలిచి కేసు వివరాలను, సంబంధిత పత్రాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. లోక్ అదాలత్ ద్వారా రాజీ అయిన కేసులలో కక్షిదారులు కోర్టుకు కట్టిన ఫీజులను తిరిగి చెల్లిస్తారని తెలిపారు. ప్రజలకు చేరువయ్యేందుకు మండల న్యాయ సేవా సంస్థ ద్వారా వివిధ కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్ ద్వారా 926 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె. శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీనివాస్, మండల న్యాయ సేవా సంస్థ సభ్యులు కొంక వెంకన్న, మేక కుమార్ రెడ్డి, జాతీయ లోక్ అదాలత్ సభ్యులు ఎస్‌పీ ప్రభాకర్, అనంతుల దుర్గాభవాని, రామకృష్ణ, మల్లేష్, జ్యోతి, సుష్మిత, లీగల్ ఎయిర్స్ కౌన్సిల్ సభ్యులు రెడ్డిపల్లి సైదులు, న్యాయవాదులు అలుగుబెల్లి నరేందర్ రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, జూనియర్, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులున్నారు.

వాటర్ షెడ్ పరిశీలన



రైతులతో నాబార్డ్ తెలంగాణ జీఎం ఉష

కొండమల్లేపల్లి: మండలంలోని వెంకటిగానితండాలో నాబార్డ్ సహకారంతో యాక్షన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, దేవరకొండ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాటర్ షెడ్‌ను శనివారం నాబార్డ్ తెలంగాణ జనరల్ మేనేజర్ ఉష పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ద్వారా రుణాలు పొందిన వారితో ఆమె సమావేశమయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు సత్యనారాయణ, వినయ్‌కుమార్, సొసైటీ ప్రెసిడెంట్ ఖాజా ఖైరత్‌అలీ, సర్పంచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు

హాలియా: స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఏర్పడి 54 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భం శనివారం హాలియా పట్టణంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువత భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కోరే రమేష్, మండల కార్యదర్శి చందు, కమిటీ సభ్యులు సాగర్, కమల్ తదితరులు ఉన్నారు.

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం కొండమల్లేపల్లి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్ ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేశ్, చరణ్, సాయి, రాహుల్, రాజేశ్వరి, అనిత, ఆంజనేయులు, మనోహర్, సాయి, రాహుల్, రాజేశ్వరి, అనిత, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



హాలియా: ఎస్ఎఫ్ఐ జెండా ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్



కొండమల్లేపల్లి: ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని దీక్ష

కొండమల్లేపల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఇండియా కూటమి ఈ వర్గీకరణకు మద్దతు ఇవ్వాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ టీఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ఎల్లేశ్‌మాదిగ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో దేవరకొండ పట్టణ అధ్యక్షుడు పొట్ట మురళి, టీఎంహెచ్‌డీ జిల్లా అధ్యక్షుడు ఎర్ర ఆంజనేయులు, ఉదయ్, జంతుక విష్ణు, పొట్ట శంకర్, ఏసోపు, గోవర్ధన్, లక్ష్మయ్య, ఆంజనేయులు, శ్రీశైలం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులు

ఇనుప రాడ్లతో దాడి.. ఒకరికి తీవ్ర గాయాలు

చింతపల్లి: రోడ్డుపై నిలబడి మాట్లాడుతున్న వ్యక్తిపై కొందరు ఇనుపరాడ్లతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చింతపల్లిలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఐతమోని వెంకటయ్య(ధన్‌రాజ్) శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో ఎక్స్ రోడ్డు నుంచి చింతపల్లిలోని తన ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో తనకు పరిచయం ఉన్న కృష్ణవేణితో మాట్లాడుతున్నాడు. గమనించిన ఇదే గ్రామానికి చెందిన కొప్పుల శ్రీను, కొప్పుల సత్తయ్య, శివ, శ్రీనులు వెంకటయ్యపై ఇనుపరాడ్లతో దాడి చేశారు. దీంతో వెంకటయ్య తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ చందారెడ్డి తెలిపారు.



గాయపడిన వెంకటయ్య

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో ఎస్ఐ సంపత్‌గౌడ్, బుసిరెడ్డి పాండురంగారెడ్డి తదితరులు

నాగార్జునసాగర్: రాష్ట్రస్థాయి ఆరో నెట్‌బాల్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం నాగార్జునసాగర్‌లోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి, స్థానిక ఎస్ఐ సంపత్ గౌడ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సోమవారం వరకు ఈ పోటీలు జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నెట్‌బాల్ అసోషియేషన్ అధ్యక్షుడు విక్రమాదిత్య రెడ్డి, రాష్ట్ర ఒలంపిక్ అసోషియేషన్ అబ్జర్వర్ కర్తయ్య, సాదత్‌ఖాన్, ఉమ్మడి జిల్లా నెట్‌బాల్ అసోషియేషన్ కార్యదర్శి కిరణ్‌కుమార్, పాఠశాల హెడ్మాస్టర్ సిస్టర్ అన్నమ్మ, ఖాజాఖాన్, తిరుమలగిరి (సాగర్)మండల వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు 5742 దరఖాస్తులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డుల్లో శనివారం ఆరు గ్యారంటీ పథకాలకు 5742 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు మూడు రోజులలో మొత్తం 14,244 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ నెల 31, జనవరి 1వ తేదీన ప్రభుత్వం సెలవు ప్రకటించినందను తిరిగి జనవరి 2వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'ఇన్‌స్పైర్ మనక్'కు సిద్ధంకండి

నల్లగొండ: జనవరిలో నిర్వహించే జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల ప్రదర్శనకు విద్యార్థులు, హెచ్‌ఎంలు, గైడ్ టీచర్లు సిద్ధం కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలో ఎంపికైన 143 మంది విద్యార్థులు తమ ఎగ్జిబిట్ల ప్రదర్శన వీడియో, ఇతర వివరాలను ఇన్‌స్పైర్ మనక్ కాంపిటేషన్ యాప్‌లో జనవరి 1 నుంచి 18 వరకు అప్‌లోడ్ చేయాలని సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి సెల్ : 9848578845 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం



మిర్యాలగూడ: ప్రజా పాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్



అడవిదేవులపల్లి: ప్రజా పాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న కేతావత్ శంకర్‌నాయక్



చింతపల్లి: కుర్మేడులో దరఖాస్తులు స్వీకరిస్తున్న దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు

మిర్యాలగూడ: ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రతి పేదవారికి అందించేందుకే ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టినట్లు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్ఆర్) అన్నారు. శనివారం మిర్యాలగూడ, దామరచర్లలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా పాలన కార్యక్రమం జనవరి 6వ తేదీ వరకు కొనసాగుతుందని, దరఖాస్తుదారులు అధికారులకు సహకరిస్తూ దరఖాస్తులను అందజేయాలని సూచించారు. తెల్ల రేషన్ కార్డు లేని వారు సైతం తెల్ల కాగితంపై తమకు రేషన్ కార్డు మంజూరు చేయాలని రాసి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ చెన్నయ్య, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌రావు, మెప్మా పీడీ కరుణాకర్, నాయకులు నూకల వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అడవిదేవులపల్లి: ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్ అన్నారు. శనివారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ మహ్మద్ షరీఫ్, ఆర్ఐ ఠాగూర్ రామకృష్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, స్థానిక సర్పంచ్ కొత్త మర్రెడ్డి, బండి నాగేశ్వర్‌రావు, గోపగాని హనుమంతు, పసుపులేటి శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలి

త్రిపురారం: గ్రామాల్లోని ప్రతిఒక్కరూ ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ అనుముల పాండమ్మ, జెడ్పీటీసీ ధనావత్ భారతి అన్నారు. శనివారం త్రిపురారం మండలంలోని జీ. అన్నారం, దుగ్గెపల్లి, సత్యనారాయణపురం, మర్రిగూడెం గ్రామాలలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమాల్లో వారు పాల్గొని అధికారులతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గాజుల ప్రమీల, జీ. అన్నారం సర్పంచ్ చిలుక సుభాష్‌రెడ్డి, చిత్రం నరేష్, ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంయమనంతో దరఖాస్తులు స్వీకరించాలి

మిర్యాలగూడ: అధికారులు సంయమనం పాటిస్తూ అభయహస్తం దరఖాస్తులు స్వీకరించి రశీదులను అందజేయాలని డీఆర్‌డీఓ కాళిందిని అన్నారు. శనివారం మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. ఆమె వెంట ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి తదితరులు ఉన్నారు.

పథకాలు అందజేసేందుకే ప్రజా పాలన

హాలియా: ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేసేందుకే ప్రజా పాలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హాలియా మున్సిపల్ కమిషనర్ కందిమళ్ల వీరారెడ్డి, మండల తహసీల్దార్ జయశ్రీ, ఎంపీడీఓ లక్ష్మి అన్నారు. శనివారం అనుముల మండలంలోని గ్రామాలతో పాటు హాలియా మున్సిపాలిటీ పరిధిలోని 6, 7, 8, 9 వార్డుల్లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జనవరి 6వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్లు చింతల చంద్రారెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజారమేష్‌యాదవ్, కౌన్సిలర్లు గౌనీ సుధారాణి, తక్కెళ్లపల్లి ఎల్లమ్మ, పిల్లి చంద్రకళ, ప్రసాద్‌నాయక్, మున్సిపల్ మేనేజర్ అబ్దుల్ రషీద్, సర్పంచులు చింతకాయల పద్మ, సైదులు, శేఖర్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న గ్రామ సభలు

చింతపల్లి: మండల పరిధిలోని ధైర్యపురితండా, కుర్మేడు, తీదేడు, వర్కాల గ్రామాల్లో శనివారం నిర్వహించిన గ్రామ సభల్లో దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములుతో పాటు ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు పాల్గొని ప్రజల నుంచి అభయహస్తం గ్యారంటీల దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 606 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శంషాద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ అర్షద్, ఆర్ఐ యాదయ్య పాల్గొన్నారు.

మాడుగులపల్లిలో..

మాడుగులపల్లి: ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మాడుగులపల్లి మండలంలోని తోపుచర్ల, ఆగమోత్కూర్, ఇందుగుల గ్రామాల్లో శనివారం గ్రామ సభలు నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేయనున్న ప్రజా సంక్షేమ పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీరించారు. ఆయా గ్రామాల్లో తహసీల్దార్ జమీరొద్దీన్, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, ఎంపీఓ రవికుమార్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పర్యవేక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్ వాడీలు తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరులో..

నిడమనూరు: మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీల్లో శనివారం ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించి అభయహస్తం గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరించారు. నందికొండవారిగూడెంలో 340, సూరేపల్లిలో 242, వడ్డెరగూడెంలో 233, పార్వతీపురంలో 193 సంబంధించి దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రషీద్, వంశీ, సర్పంచులు అంజమ్మ, ఆండాలు, బ్రహ్మన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డిండి మండలంలో..

డిండి: ప్రజా పాలన కార్యక్రమంలో అర్హులైన ప్రతిఒక్కరూ ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్. తిరుపతయ్య అన్నారు. శనివారం డిండి మండల పరిధిలోని జేత్యతండా, బొల్లనపల్లి, కామేపల్లి గ్రామాలలో వచ్చిన అర్హుల నుంచి వచ్చిన దరఖాస్తులను ఇన్‌చార్జి ఎంపీడీఓ డ్యానియల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ ముస్తాఫా, ఆర్ఐ శ్యామ్, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: ప్రజా పాలనలో భాగంగా శనివారం మూడో రోజూ గ్రామ సభలు కొనసాగాయి. కొండమల్లేపల్లి మండలంలోని గుమ్మడవెల్లి, దోనియాల, చెన్నంనేనిపల్లి గ్రామ పంచాయతీలలో నిర్వహించిన గ్రామ సభలలో మొత్తం 981 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ: తుంగపాడులో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ కాళిందిని



హాలియా: 6వ వార్డులో దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి



డిండి: జేత్యతండాలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ తిరుపతయ్య

నూతన సంవత్సర వేడుకలకు సిద్ధం

- నాగార్జునసాగర్‌లో అడ్వాన్స్ బుకింగ్ అయిన హోటల్స్, రిసార్ట్స్

నాగార్జునసాగర్: నూతన సంవత్సర వేడుకల కోసం నాగార్జునసాగర్‌లోని అతిథి గృహాలన్నింటిని ఔత్సాహికులు బుక్ చేసుకున్నారు. 20రోజుల క్రితమే విజయ విహార్‌లోని గదులన్నీ ఆన్‌లైన్‌లో బుక్ అయ్యాయి. స్థానిక సిద్ధార్థ హోటల్‌తో పాటు సాగర్ డ్యాం అవతలివైపు నూతనంగా 40గదులతో నిర్మించిన మాతా సరోవర్ రిసార్ట్స్‌తో పాటు చిన్నాచితక లాడ్జీలన్నీ ఆది, సోమవారాలలో పర్యాటకులతో కిటకిటలాడనున్నాయి.

శృతిమించితే చర్యలు తప్పవు

నూతన సంవత్సర వేడుకల్లో జోష్ శృతిమించితే కఠిన చర్యలు తీసుకుంటామని నాగార్జునసాగర్ సీఐ బీసన్న అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మద్య సేవించి వాహనాలు నడిపితే కేసు నమోదు చేస్తామన్నారు. అనుమతిలేని హోటల్స్‌లో వినియోగదారులకు మద్యం సరఫరా చేసినా నేరమవుతుందని వివరించారు. డీజేలకు అనుమతులు లేవని పేర్కొన్నారు.



విజయ విహార్ అతిథి గృహం

ఉద్యమకారులకు ఇంటి స్థలం ఇవ్వాలి

నల్లగొండ: మలిదశ ఉద్యమంలో పాల్గొని అనేక ఉద్యోగ అవకాశాలు కోల్పోయామని అది గమనించి కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇవ్వాలని మలిదశ తెలంగాణ ఉద్యమకారులు కోరారు. శనివారం ఎన్జీ కళాశాలలో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1969 ఉద్యమకారులకు ఇచ్చిన సదుపాయాలు తమకు కూడా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మలిదశ ఉద్యమకారుల కమిటీ కన్వీనర్‌గా పెరిక జయరాజును ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఉద్యమకారులు మాతంగి అమర్, నలుగురు కిరణ్ కుమార్, వెంకటేశ్వర్లు, పరమేష్, ఎండీ ఖాసీం, పర్వతం వేణు తదితరులు పాల్గొన్నారు.